# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 144 | విశాఖపట్నం | 24-2-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :144 | VISAKHAPATNAM | 24-2-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...


ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో తలసరి ఆదాయం

# భారీగా పెంపు: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో సోమవారం సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై చర్చిం చారు. సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వ్యాఖ్యా నించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు. నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటు న్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకు న్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్ర మమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గా లనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగ డవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# కల్తీ పాల ఘటనపై జగన్ ఫైర్

## ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ




**తాడేపల్లి, పతాకం న్యూస్:** రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి నలుగురు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆయన, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆహార భద్రత అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని జగన్ ఆరోపించారు. ఈ దారుణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగాలని, అవసరమైతే నిపుణులైన వైద్య బృందాలను పంపాలని జగన్ కోరారు. ఆహార భద్రత తనిఖీలను కట్టుదిట్టం చేసి, పాల వంటి నిత్యావసరాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని విజ్ఞప్తి చేశారు.

2లో



పరీక్ష రాయాలంటే.. నదీ దాటాల్సిందే..

### ఎక్కువ సేపు కూర్చుని పనిచేస్తున్నారా? ఈ వ్యాధులు రావచ్చు!



6లో

2లో



అంబటి ఇంటికి ముద్రగడ.. చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు


## రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యల కల్లోలం..

# నలుగురి మృతి





**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్ప త్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. (తరువాయి 2వ పేజీలో)



2లో

మృతులకు రూ.10 లక్షల పరిహారం..
కల్తీ పాల ఘటనపై అసెంబ్లీలో చంద్రబాబు ప్రకటన



2లో

### కల్తీ పాల ఘటన బాధితులకు మెరుగైన వైద్యం అందించండి: సత్యకుమార్


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# హెచ్‌పీవీ టీకా ఉపయోగమేనా!

దేశంలోని పలు రాష్ట్రాలు బాలికలకు ఉచిత హెచ్.పి.వి టీకా కార్యక్రమాలను ప్రారంభి స్తున్నాయి. తెలంగాణలో లక్షల డోసులు సమీకరించి 14-15 ఏళ్ల బాలికలకు అందించనున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పంజాబ్, సిక్కిం ఇప్పటికే పాఠశాలల ద్వారా టీకా అమలు చేస్తున్న రాష్ట్రాలు. ఢిల్లీ కూడా ఉచిత టీకా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ టీకా కార్యక్రమంలో హెచ్.పి.వి ని చేర్చే దిశగా అడుగులు వేస్తోంది. సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) భారాన్ని తగ్గించాలన్న ఉద్దేశం మంచి లక్ష్యంతో కూడుకున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్లోబోకాన్ 2020 అంచనాల ప్రకారం దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 1.23 లక్షల కొత్త కేసులు, 77 వేల వరకు మరణాలు నమోద వుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలస్యంగా గుర్తించడం వల్ల పరిస్థితి మరింత తీవ్రమవుతోంది. కాబట్టి నిరోధక చర్యలు అవసరమే. ఈ వ్యాధికి ప్రధాన కారణం హెచ్.పి.వి వైరస్. ముఖ్యంగా 16, 18 రకాలు అధిక శాతం కేసులకు కారణం. వైరస్ సోకిన వెంటనే క్యాన్సర్ రాదు. చాలామందిలో అది తగ్గిపోతుంది. కానీ కొందరిలో 10-20 సంవత్సరాల పాటు కణాల్లో మెల్లగా మార్పులు జరిగి చివరకు క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంటుంది. ఈ మధ్య దశలో గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చు. హెచ్.పి.వి టీకా ప్రధాన హై-రిస్క్ రకాలపై రక్షణనిస్తుంది. ప్రీ-క్యాన్సరస్ దశలు తగ్గుతున్నాయని అంతర్జాతీయ అధ్యయనాలు చూపించాయి. కానీ ఇది 100 శాతం రక్షణ కాదు. అన్ని రకాల వైరస్‌లపై రక్షణ లేదు. ఇప్పటికే వైరస్ సోకిన వారికి ఇది చికిత్స కాదు. టీకా తీసుకున్నప్పటికీ భవిష్యత్తులో స్క్రీనింగ్ అవసరం అలాగే ఉంటుంది. ఈ పరిమితిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. సర్వైకల్ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడానికి వి.ఐ.ఎ (విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ అసెటిక్ యాసిడ్) వంటి సులభ పరీక్షలు ఉన్నాయి. తక్కువ ఖర్చుతో, గ్రామీణ స్థాయిలో కూడా చేయగలిగే పరీక్ష ఇది. పాప్‌స్మియర్ మరో పద్ధతి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ) కూడా టీకాతో పాటు స్క్రీనింగ్‌కు సమానంగా ప్రాముఖ్యతనిస్తోంది. టీకా ఉన్నదికదా అని స్క్రీనింగ్‌ను విస్మరించడం ప్రమాదకరం. హెచ్.పి.వి కి అనేక రకాలున్నాయి. బైవాలెంట్, క్వాడ్రివాలెంట్, నోనావాలెంట్ అనే రకాల టీకాలు ఉన్నాయి. కొన్ని రెండు రకాలపై, కొన్ని నాలుగు లేదా తొమ్మిది రకాలపై రక్షణ ఇస్తాయి. ఖర్చు కూడా వాటి ప్రకారం మారుతుంది. ప్రభుత్వాలు ఏ టీకా ఎంపిక చేస్తున్నాయి? ఎందుకు ఆ ఎంపిక ఖర్చు-ప్రయోజన లెక్కలు ఏమిటి? ప్రజలకు తెలియాలి. ప్రజారోగ్యంలో పారదర్శకతే విశ్వాసానికి పునాది. ప్రైవేట్ రంగంలో ఒక్క డోసుకు వేల రూపాయలు ఖర్చవుతుంది. బల్క్ కొనుగోలు వల్ల ధర తగ్గినా, నిల్వ, రవాణా, శిక్షణ, పర్యవేక్షణ...అన్నీ కలిపి ఇది పెద్ద వ్యయం. ప్రతి సంవత్సరం అదే వయస్సుగల బాలికలకు ఇవ్వాలి. ఇది ఒకసారి చేసే కార్యక్రమం కాదు. దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక అవసరం. ఇదే సమయంలో ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారం మహిళలలో అనీమియా 50 శాతం దాటింది. గ్రామీణ ప్రాంతాల్లో స్క్రీనింగ్ కవరేజ్ పరిమితంగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతం కావాలి. ఈ నేపథ్యంలో ఖర్చు-ప్రాధాన్యతల సమతుల్యం ఎలా కుదిరిందనే ప్రశ్న సహజమే. టీకా దీర్ఘకాల పెట్టుబడి అయితే, స్క్రీనింగ్ తక్షణ ప్రాణరక్షణ చర్య. 2009లో గిరిజన ప్రాంతాల్లో అమలు చేసిన హెచ్.పి.వి ప్రాజెక్ట్ వివాదానికి దారితీసింది. మరణాలకు టీకాతో ప్రత్యక్ష సంబంధం నిర్ధారించలేదని అధికారిక నివేదికలు చెప్పినా, అనుమతి ప్రక్రియలో లోపాలున్నాయని విమర్శలు వచ్చాయి. మహిళా సంఘాలు నైతిక ప్రశ్నలు లేవనెత్తాయి. ఆ సంఘటన ప్రజల్లో అనుమానాన్ని పెంచింది. ఇప్పుడు చేపడుతున్న కార్యక్రమాల్లో పూర్తి సమాచారం, బలమైన సమ్మతి ప్రక్రియ, స్వతంత్ర పర్యవేక్షణ అవసరం. హెచ్.పి.వి టీకా అవసరం ఉండవచ్చు. అపోహలు వ్యాప్తి చేయడం సరైంది కాదు. కానీ ప్రశ్నలు అడగడం కూడా తప్పు కాదు. టీకా ఒక సాధనం మాత్రమే. స్క్రీనింగ్, అవగాహన, పోషకాహారం, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం...వంటివన్నీ కలిసి నడిస్తేనే సర్వైకల్ క్యాన్సర్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రజారోగ్యంలో విశ్వాసం బలవంతపు ప్రచారంతో రాదు. నిజమైన సమాచారం, స్పష్టమైన ఖర్చు లెక్కలు, పారదర్శక అమలు...ఇవే దీర్ఘకాల విజయానికి పునాది. ప్రశ్నించడం వ్యతిరేకత కాదు. సమాధానం ఇవ్వడం బాధ్యత. అదే ప్రజాస్వామ్య ఆరోగ్య సంస్కృతి.

# పరీక్ష రాయాలంటే.. నదీ దాటాల్సిందే..

**పరీక్ష రాయాలంటే... ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రావాల్సిందే..**



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు పరీక్షలని కొన్ని ప్రసంగాల్లో సిఎం నుంచి సర్పంచి వరకు, రాష్ట్ర అధికారి నుంచి మండల స్థాయి అధికారి వరకూ చెబుతున్న మాటే. అయితే అటువంటి పరీక్షలు మండలంలోని ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో విద్యార్థులు కష్టాల మధ్య ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష సమయం కావడంతో నాగావళినది ఆవలి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు నదిలో దిగి రావడంతో అనేక కష్టాలు పడ్డారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాసేందుకు నాగవళి నది ఆవల ఉన్న కొట్టు, తోడుము విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అవేదన వ్యక్తం చేస్తున్నారు. నది ఆవలి తదితర గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు కొమరాడలో జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసేందుకు వచ్చారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నది దాటాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే నదిలో స్వల్పంగా నీటి ప్రవాహం కొంత అధికంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ నీటిలో నడుచుకొని పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారు. అయితే నది ఆవలి నుంచి కొమరాడ వచ్చేసరికి సుమారు గంటన్నర సమయం పడుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా విద్యార్థులకు ఈ కష్టాలు తప్పడం లేదని పలువురు చెబుతున్నారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు నాగవళి నదిలో పిట్లు పడుతూ పరీక్షకు హాజరయ్యారు. ప్రతి ఏటా నాగవళి నది ఆవల ఉన్న విద్యార్థులు ఈ అవస్థలు తప్పడం లేదు. పూర్ణపాడు -- లాబేసు వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడం ఒక ఇబ్బంది అయితే కోట్లు- కొమరాడల మధ్య పడల కొన్ని సార్లు వేయకపోవడం మరింత కష్టతరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మృతులకు రూ.10 లక్షల పరిహారం.. కల్తీ పాల ఘటనపై అసెంబ్లీలో చంద్రబాబు ప్రకటన



**అమరావతి, పతాకం న్యూస్:** రాజమండ్రిలో కల్తీ పాల కారణంగా నలుగురు మృతి చెందిన ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇవాళ శాసనసభలో ఈ విషయంపై ప్రకటన చేశారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి నరసాపురంలోని వరలక్ష్మి డెయిరీ నుంచి పాలు సరఫరా అయినట్లు సీఎం సభకు వివరించారు. ఇప్పటికే పాల నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ల్యాబ్ నివేదికలో పాలలో కల్తీ జరిగినట్లు తేలితే, అందుకు బాధ్యులైన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు.

# కల్తీ పాల ఘటన బాధితులకు మెరుగైన వైద్యం అందించండి: సత్యకుమార్



**అమరావతి, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న కల్తీ పాల ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలు, నూనెలు, ఇతర వాటి సేకరణ ఎంతవరకు జరిగింది? ఫలితాలు ఎలా ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. నమూనాల సేకరణ, ఫలితాల పరిస్థితి ఏమిటి? అని అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కల్తీ పాల బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు మంత్రికి వివరించారు. ఫలితాలొచ్చేందుకు 72 గంటల వరకు సమయం పడుతుందని తెలిపారు. ఆసుపత్రుల్లో ఉన్న వారి నుంచి కూడా రక్త నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రుల్లో ఉన్న బాధితుల నివాస పరిసర ప్రాంతాల వారి ఆరోగ్య వివరాలనూ సేకరిస్తున్నామన్నారు. కాగా.. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ అమరావతి నుంచి రాజమహేంద్రవరం బయల్దేరారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం) డైరెక్టర్ నీలకంఠారెడ్డి ఇప్పటికే రాజమహేంద్రవరం వెళ్లారు. పాల వినియోగంపై బాధిత కుటుంబాల వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లతో నమూనాల సేకరణ, తదుపరి చర్యలపై సమీక్షించారు.

# హెరిటేజ్‌పై ఫేక్ ప్రచారం చేశారు: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హెరిటేజ్‌పై ఫేక్ ప్రచారం చేశారని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందపూరు డెయిరీకి హెరిటేజ్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ బొత్స ఇంద్రపూర్ డెయిరీకి.. హెరిటేజ్ కో కంపెనీ అని అసత్య ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. అంత సీనియర్ నేతకు కో కంపెనీ అనే పదం ఉండదనే విషయం తెలియదా? అని నిలదీశారు. ఆయన ఇప్పటికైనా ఇందపూరు డెయిరీ హెరిటేజ్ కో ప్యాకర్ మాత్రమేనని తెలుసుకోవాలని చెప్పుకొచ్చారు. హెరిటేజ్ లిస్టెడ్ కంపెనీ అని.. తమ మీద సెబీకి కూడా జగన్ అండ్ కో ఫిర్యాదు చేశారని ప్రస్తావించారు. వాటికి సంబంధించి ఏమైనా ఆధారాలు ఇచ్చారా? నిరూపించారా.? అని వైసీపీ నేతలపై మంత్రి లోకేశ్ ప్రశ్నల వర్షం కురిపించారు. కిలో నెయ్యి రూ.360లకు ఎక్కడ దొరుకుతుందో నిరుపించాలని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. కిలో రూ.360లకు దొరుకుతుంటే అది కల్తీ నెయ్యి మాత్రమే అవుతుందని చెప్పుకొచ్చారు. మామూలుగా మార్కెట్‌లో కిలో నెయ్యి రూ.1000ల పైన ఉందని తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లలో సాక్షి, భారతి సిమెంట్స్‌కు ప్రభుత్వం నుంచి రూ.1000 కోట్ల లబ్ధి పొందారని ఆరోపించారు. తాము ఇన్ని సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి తీసుకోలేదని స్పష్టం చేశారు. క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా ఫైనల్స్‌కు వెళ్తే ఆ మ్యాచ్ చూసేందుకు తప్పనిసరిగా వెళ్తానని తెలిపారు. అవసరమైతే జగన్ రెడ్డి వస్తానంటే ఆయనకు కూడా తానే టికెట్ తీసుకుంటానన్నారు. శాసనమండలి సజావుగా జరగాలనుకున్న వైసీపీ సభ్యులు.. నాలుగు రోజులుగా ఎందుకు అడ్డుకుంటారని లోకేశ్ ప్రశ్నించారు. ఇప్పుడు బడ్జెట్ మీద చర్చ కావాలని శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడగటం ఏమిటని నిలదీశారు. ఈ విషయం శాసనమండలి సమావేశాలను అడ్డుకున్నప్పుడు వైసీపీ సభ్యులకు తెలియదా? అని నిలదీశారు. తెలుగుదేశంలో జూనియర్లు, సీనియర్ల మధ్య పూర్తి సమన్వయం ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీలో తనతో సహా అందరూ నేతలకు కూడా ఎన్నికల్లో మెజారిటీ రావాలని సూచించారు. అప్పుడు మాత్రమే మనం పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోగలమని దిశానిర్దేశం చేశారు. యువగళం సమయంలో తాను అందరినీ కలిసేవాడినని.. రెండేళ్ల గ్యాప్ వచ్చిందని ప్రస్తావించారు. అందుకే మళ్లీ నేతలు, వారి కుటుంబ సభ్యులతో భేటీ అవుతున్నానని తెలిపారు. అక్కడ అసలు రాజకీయాలు చర్చించడం లేదని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

# అంబటి ఇంటికి ముద్రగడ.. చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు



**గుంటూరు, పతాకం న్యూస్:** వైసీపీ సీనియర్ నేత, కాపు ఉద్యమ ప్రముఖుడు ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల గుంటూరులో దాడికి గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. కూటమి పాలనలో వైసీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అంబటి ఇంటిపై దాడి బాధాకరమని, ఇళ్లపై దాడులు చేసే సంస్కృతి మంచిది కాదని హితవు పలికారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, బాధితుడైన అంబటినే జైల్లో పెడతారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ పర్యటనలో అంబటి కుమార్తె మౌనికను ప్రత్యేకంగా అభినందించిన ముద్రగడ, ఆమెను 'ఫైర్‌బ్రాండ్' అని అభివర్ణించారు. భవిష్యత్తులో ఆమె పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం చంద్రబాబుపై ముద్రగడ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాపుల ఓట్లతో రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మళ్లీ కాపులనే వేధిస్తున్నారు. నాడు నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారు, ఇప్పుడు అంబటిని టార్గెట్ చేశారు. మాకు జరిగిన అవమానాలు మీ కుటుంబ సభ్యులైన భార్య, కొడుకు, కోడలికి జరిగితే ఎలా ఉంటుందో ఆలోచించండి" అని చంద్రబాబును ఉద్దేశించి ప్రశ్నించారు. కాపులు బానిసలు కాదని, తమను అవమానించడం ఆపాలని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలోనూ కూటమి ప్రభుత్వం రోజూ అబద్ధాలు ఆడుతోందని ముద్రగడ విమర్శించారు. "ఇకనైనా అబద్ధాలు ఆపి శ్రీవారికి క్షమాపణ చెప్పండి లేదా కనీసం లడ్డూ గురించి మాట్లాడటం మానేయండి" అని సూచించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కక్ష సాధింపు చర్యలు, ఇళ్లపై దాడులకు స్వస్తి పలకాలని ప్రభుత్వానికి హితవు పలికారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముద్రగడ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకున్నట్లయింది.

# నలుగురి మృతి

(మొదటిపేజీ తరువాయి)

బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి (15వ తేదీ) రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణేష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

# శరవేగంగా రహదారి నిర్మాణ పనులు



**అరకులోయ, పతాకం న్యూస్:** జిల్లాలో రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. అరకులోయ, అనంతగిరి మండలాలను కలుపుతూ చేపడుతున్న రోడ్డు నిర్మాణం జోరందుకుంది. ముఖ్యంగా రెండు మండలాలను కలుపుతూ నిర్మిస్తున్న బొండాం కొత్తవలస- కితలంగి రోడ్డు పనులు ఊపందుకున్నాయి. వచ్చే నెలలోగా పనులు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే అరకులోయ, అనంతగిరి మండలాల పరిధిలో ఉన్న బొండాం, గన్నెల, లోతేరు, సుంకరమెట్ట, అలాగే అనంతగిరి మండల పరిధిలో బొర్రా, కోనాపురం గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరతాయి. ప్రధానంగా సుంకరమెట్ట వారపు సంతకు అటవీ ఉత్పత్తులను తీసుకువెళ్లడానికి గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అరకులోయ మండలం బొండాం పంచాయతీ పరిధిలో ఉన్న కరకవలస, జయంతివలస, కొల్యగుడ గ్రామం మీదుగా బొండాం కొత్తవలసకు నిర్మిస్తున్న రోడ్డు కూడా పూర్తయితే పలు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. వాస్తవానికి జయంతివలస నుంచి పెద్దగెడ్డ వంతెన వరకు తారురోడ్డు నిర్మించారు. పెద్దగెడ్డ వంతెన నుంచి కొల్యాగుడ మీదుగా బొండాం కొత్తవలస వరకు తారురోడ్డు నిర్మాణంలో భాగంగా మెటల్ వేసి రెండు నెలల క్రితం పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. రాళ్లు తేలి ఉండడంతో ఈ మార్గంలో ప్రయాణించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే నేరుగా కరకవలస నుంచి కొత్తవలస, బొండ్యాగుడ, కోనాపురం, చప్పాడి, బొర్రాకు చేరుకోవచ్చు. ఘాట్‌రోడ్డుకు బదులు బొర్రాకు వెళ్లేందుకు ఇది ప్రత్యామ్నాయ రహదారిగా ఉపయోగపడుతుంది. బొర్రాకు చేరుకునేందుకు దూరం తగ్గుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## జీడీ పంటకు మద్దతు ధర ప్రకటించాలి

### ప్రకటించకపోతే జిల్లా వ్యాప్త ఉద్యమానికి ముందుకు వెళదాం



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** ఇతర దేశాల నుండి దిగుమతి అవుతున్న జీడి పిక్కలను తక్షణమే నిలుపుదల చేసి మన రాష్ట్రలో పండించే జీడి పిక్కలకు అసెంబ్లీలో చర్చించి మద్దతు ధర ప్రకటించి,కేజీ జీడీ పిక్కలకు 200 రూ,ఇచ్చే విదంగా ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాలు ద్వారా కోనుగోలు చేయాలని డిమాండ్ చేసిన దేవరాపల్లి మండలం గర్సింగి పంచాయతీలో గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రైతులుకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న,మండల కార్యదర్శి బిటి దొర, రైతులతో కలిసి మాట్లాడుతూ జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు ప్రభుత్వం వరి, చెరకు, పత్తి,పామ్ఆయిల్ మొదలగు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుంది కానీ జీడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం అన్యాయశీ అని ఆన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో జీడీ మద్దతు ధర మార్కెట్ సౌకర్యం కోసం చర్చించాలని కోరారు.జీడీ పంటకు నిలకడగా ధర ఉండక పోవడంతో జీడి పిక్కలు పంట సమయంలో వ్యాపారులు రైతులకు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేసారు. వ్యాపారులు చేతికి జీడిపిక్కలు చేరిన తరువాత ఆమాంతంగా జీడి,పప్పు ధర పెరుగు పోతుందని అన్నాడు.రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .జీడి పిక్కల ధర ప్రభుత్వం శాస్త్రీయంగా నిర్ణయించి అమలు చేయక పోవడంతో వ్యాపారులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ప్రస్తుతం 80 కేజీల జీడిపిక్కలు బస్తాకు వ్యాపారులు ఎనిమిది వేలు రూపాయిలు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో జీడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురిఅవుతున్నారని తెలిపారు.జీడిపప్పు బస్తా (80 కేజీలు) పిక్కలకు 22 కేజీలు పప్పు వస్తుంది. మరో 3 కేజీలు ముక్కలు, తొక్కలు ఒక బస్తాకు 50 కేజీలు వస్తాయని.దీని ప్రకారం ప్రస్తుత మార్కెట్లో ధరల ప్రకారం సుమారు బస్తాకు రూ. 19,400/- లు ఆదాయం వ్యాపారులకు వస్తుందని తెలిపారు.ప్రోసెసింగ్ ఖర్చు బస్తాకు రెండు వేలు , రైతుకు చెల్లించే16వేలు కలిపి మొత్తం రూ.18,వేలు ఖర్చులకు పోగా ఒక బస్తాకు 1900 రూపాయలు వ్యాపారులకు మిగులుతుందన్నారు. మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు న్యాయమైన ధర చెల్లించి, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు. మన దేశంలో జీడి సాగులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని. అనకాపల్లి జిల్లాలో 90 వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారనీ వేలాది మంది రైతులు గిరిజనులు ధళితులు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. 25 వేల మెట్రిక్ టన్నులు జీడి పిక్కలు ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. నాన్ షేడ్యూల్డ్ గిరిజన, తీర ప్రాంతంలో నీటి వనరులు లేని మెట్ట ప్రాంతంలో జీడి పంట ప్రధాన మైన వాణిజ్య సాగుగా రైతులు పండిస్తున్నారని తెలిపారు జీడి పంట విస్తరణ, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద పెట్టాలని ఇతర దేశాలు నుండి దిగుమతి అవుతున్న జీడీ పిక్కలను వెంటనే నిలుపుదల చేయాలని ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో.జీడి రైతుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి మద్దతు ధర ఇచ్చి కోనుగోలు చేయాలని డిమాండ్ చేసారు జీడికి మద్దతు ధర కోసం జిల్లా వ్యాప్తంగా అందోళను చేస్తామని వారు స్పష్టం చేశారు.

## అరకులోయ పోలీస్ స్టేషన్ తనిఖీ



**అరకులోయ, పతాకం న్యూస్:** అరకులోయ పోలీస్ స్టేషన్‌ను పాడేరు డీఎస్పీ అభిషేక్ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేసి పరిష్కరించాలని అరకు సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావులను ఆయన ఆదేశించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అతివేగంగా నడిపే వారిపై, లైసెన్సు, రికార్డులు లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే పర్యాటకులు, ప్రయాణికుల ముసుగులో గంజాయి రవాణా చేసేవారిపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి సాగును శాశ్వతంగా నివారించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు.

## జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలి

### జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బిసి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర పిలుపునిచ్చారు. సోమవారం నర్సీపట్నం మున్సిపాలిటీ జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి 5వ విడత క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదును నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో చేపడతామని, దీనికి జనసైనికులు సిద్ధం కావాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి, ఉమ్మడి జిల్లా జిల్లా సెక్రెటరీలు పంచాడ హరినాథ్, అల్లాడ సురేష్, గొలుగొండ మండల సీనియర్ నాయకులు, చోద్యం పిఎస్ఎస్ డైరెక్టర్ రేగుబల్ల శివ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రసాద్ బాబు, దేవి, గొలుగొండ మండలం ఎస్సీ సెల్ బోయిన చిరంజీవి, నాతవరం మండలం ఉపాధ్యక్షులు గుడివాడ అశ్విన్ కుమార్, మాకవరపాలెం ఉపాధ్యక్షులు నమ్మి కొండలరావు, మాకవరపాలెం యూత్ అధ్యక్షులు ఎస్ఎస్.కుమార్, నర్సీపట్నం వెంకటేశ్వరస్వామి గుడి డైరెక్టర్ వాసు, అబ్బానాయుడు, మాకవరపాలెం నాయకులు శ్రీను, నర్సీపట్నం టౌన్ నాయకులు అంజూరు శ్రీనివాసరావు, నాతవరం మండలం నాయకులు గుడివాడ కృష్ణ, నాతవరం మండలం ఎస్టీ సెల్ అధ్యక్షులు జంపా రమణ, లింగాలు, ఎలిశెట్టి సాయికుమార్, కర్రి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ తీరు సిగ్గుచేటు: పల్లా




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాల కోసం తాపత్రయపడుతున్న కాంగ్రెస్ పార్టీ దేశాభివృద్ధికి అడ్డుపడుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు అన్నారు. ఢిల్లీలో జరిగిన ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహరించిన తీరుకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కూటమి నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ లాంటి దుష్టశక్తులను ఎదుర్కొనేందుకు సమష్టిగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాల్లోని దిగ్గజ సంస్థల పెద్దలు పాల్గొన్న ఏఐ సిమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహరించిన తీరు సిగ్గు చేటన్నారు. నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, కానీ దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా ఏఐ సమ్మిట్‌లో చొక్కాలు విప్పి అర్ధనగ్న ప్రదర్శన చేయడం దారుణమన్నారు. ప్రధాని మంత్రి నరేంద్రమోదీని దెబ్బతీశామని అనుకుంటే పొరపాటని, ఇది భారతీయుల ఏఐపై ప్రపంచ వ్యాప్తంగా చర్చసాగుతోందని, దీనికి మన దేశమే రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. విశాఖ పట్నం ఏఐకు కేరాఫ్ అడ్రస్‌గా మారబోతుందన్నారు. మోదీ నాయకత్వంలో దేశానికి వచ్చే పెట్టుబడులను అడ్డుకోవడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందన్నారు. దేశంలో తల్లి కాంగ్రెస్, రాష్ట్రంలో పిల్ల కాంగ్రెస్ కలిసి ఆడుతున్న నాటకమని, దీనిని ప్రజలంతా గమనించాలన్నారు. భావి తరాలకు భవిష్యత్తు లేకుండా చేయాలనే కాంగ్రెస్ పార్టీ చర్యలను తిప్పికొడతామన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఐక్యంగా ముందుకు వెళ్తున్నాయన్నారు.

## నర్సీపట్నంలో ఏటీఎం మోసం.. నిందితుడు అరెస్ట్





**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం టౌన్ పరిధిలో ఏటీఎం వద్ద వృద్ధుడిని మోసం చేసి నగదు దోచుకున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ధర్మసాగరం గ్రామానికి చెందిన 67 ఏళ్ల సుకల నూకరాజు 17 జనవరి 2026న ఐదీ= షాపింగ్ మాల్ సమీపంలోని పాత ఆంధ్రా బ్యాంక్ ాావీ వద్ద నగదు తీసుకునేందుకు వెళ్లాడు. ాావీ ఉపయోగించడం రాకపోవడంతో అక్కడ ఉన్న గుర్తుతెలియని వ్యక్తి సహాయం చేస్తానని చెప్పి కార్డు తీసుకుని పిన్ తెలుసుకొని, వేరే కార్డు ఇచ్చి మోసం చేశాడు. అనంతరం అసలు కార్డుతో రూ15,000 ఉపసంహరించుకుని పరారయ్యాడ ని ఫిర్యాదు మేరకు నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 31/2026 కింద కేసు నమోదు చేయడం జరిగిందని డీస్పీ శ్రీనువాస్ తెలిపారు. దర్యాప్తులో పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ముప్వ వీరయ్య చౌదరిని గుర్తించారు. 23 ఫిబ్రవరి 2026న ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో మళ్లీ నేరానికి ప్రయత్నిస్తుండగా అతన్ని పట్టుకున్నారు. విచారణలో అతనిపై పలు జిల్లాల్లో కేసులు ఉన్నట్లు, 2017 నుంచి సుమారు 20 కేసులు నమోదైనట్లు తెలిసింది. అతని వద్ద నుండి రూ.10,000 నగదు, 9 ఏటీఎం కార్డులు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానానికి తరలించారు.

**పోలీసుల హెచ్చరిక:** నిందితుడు ఏటీఎం కేంద్రాల వద్ద వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని పిన్ తెలుసుకొని నకిలీ కార్డు ఇచ్చి మోసం చేస్తుంటాడని.. అపరిచితుల సహాయం తీసుకోవద్దు.. పిన్ ఎవరికీ చెప్పవద్దు.. అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.. ఈ సందర్భంగా సి ఐ ఘఫుర్ , ఎస్ఐ రమేష్ క్రైమ్ సిబ్బంది ను అబినందించారు.

## వరల్డ్ టీంకింగ్ డే సెలెబ్రేషన్స్



**మల్కాపురం, పతాకం న్యూస్ :** పీ.ఎం.శ్రీ కేంద్రియ విద్యాలయం మల్కాపురం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో వరల్డ్ టీంకింగ్ డే సెలెబ్రేషన్స్ జరిగాయి. ఇందులో భాగంగా సర్వదర్శన ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమములో ప్రిన్సిపాల్ సత్య జిత్ మీశ్రా, మాస్టర్ జగన్మోహన్ రావు, మాలవియా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## 'చిగురు' కార్యక్రమంలో మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ




**మల్కాపురం, పతాకం న్యూస్ :**మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన స్వచ్ఛంద సంస్థ.. యూత్ ఫర్ సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "చిగురు " కార్యక్రమంలో మల్కాపురం జీవీఎంసీ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పాల్గొన్న అన్ని విభాగాలలో విద్యార్థులు విజేతలుగా నిలిచి బహుమతులు సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. భవిష్యత్తులో పాల్గొని మరిన్ని పోటీలలో విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## భూ సమస్యపై పంచదార్ల దళితుల వినతి

**ఎలమంచిలి, పతాకం న్యూస్:** అనకాపల్లి విచ్చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామ దళిత రైతులు తమ భూ సమస్యపై వినతిపత్రం అందజేశారు. తమ పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వం తమకు 48 సంవత్సరాల క్రితం ఇచ్చిన డి పట్టా భూములను తప్పుడు పద్ధతుల్లో కొందరు తీసుకోవాలని చూస్తున్నారని తెలిపారు. 21 రోజులుగా పోరాటం చేస్తున్నామని, తమ భూములలోనే ఉంటూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. తమ పోరాటానికి సిపిఎం అండదండలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంబంధిత సమస్యపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని అన్నారు.

# కల్తీ నెయ్యిపై సీఎం కీలక ప్రకటన

## 24న అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చ



**అమరావతి, పతాకం న్యూస్:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలతో నెయ్యి కల్తీపై చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్?లో చంద్రబాబును మంత్రులు కలిశారు. అన్యమతస్థులకు డిక్లరేషన్ నిబంధన మరింత కఠినతరం చేయాలనే అంశంపై చర్చించారు. తిరుమల శ్రీవారి ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యిలో రసాయనాల మిశ్రమంపై శాసనసభలో మంగళవారం 4 గంటల పాటు చర్చ జరగనుంది. మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల అనంతరం జీరో అవర్ రద్దు చేసి ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు కల్తీ నెయ్యిపై చర్చించాలని నిర్ణయించారు. నెయ్యి కల్తీపై కూటమి ఎమ్మెల్యేలతో మాట్లాడించాలని నిర్ణయం తీసుకున్నారు. స్వల్ప అస్వస్థత కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ రోజు సభకు రాలేదు. రేపు సభకు వచ్చిన తరువాత కల్తీ నెయ్యిపై పవన్ కల్యాణ్ కూడా ఈ చర్చలో పాల్గొనే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12.30 గంటలకు కల్తీ నెయ్యిపై సీఎం చంద్రబాబు ఓ ప్రకటన చేయనున్నారు. టీటీడీ నిబంధనలు ప్రకారం అన్యమతస్థులు శ్రీవారి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్వర్ణ దేవాలయం తరహాలో: తిరుమలలోనూ స్వర్ణ దేవాలయం తరహాలో చట్టాన్నీ తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అమృతసర్?లో స్వర్ణ దేవాలయానికి ఉన్న ప్రత్యేక చట్టం ద్వారా తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం ఉంది. అటువంటి చట్టాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంకు కూడా తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తీసుకునే వెసులుబాటు కల్పించే దిశగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. స్వర్ణ దేవాలయం చట్టాన్ని వెంటనే అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తిరుమల లడ్డూ కల్తీకి సంబంధించి వాస్తవాలన్నీ రేపు అసెంబ్లీలో పెడతామని అసెంబ్లీ లాబీలో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో మంత్రి నారా లోకేశ్ చెప్పారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామని అన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవ్వరూ బొట్టుపెట్టి పిలవరని ఎద్దేవాచేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైఎస్సార్సీపీ రోడ్డు మీదకు తీసుకురావవటం బాధాకరమైన విషయమని మండిపడ్డారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమని మంత్రి లోకేశ్ అన్నారు. మరోవైపు శాసనమండలిలో వైఎస్సార్సీపీ తీరు మారలేదు. హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేయడంపై శాసన మండలిలో చర్చించాలని మండలిలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు వరుసగా ఐదో రోజు ఆందోళనకు దిగారు. ఇవాళ సభలో చర్చించాలని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు వరుసగా ఐదోరోజు వాయిదా తీర్మానం ఇవ్వగా దాన్ని మండలి ఛైర్మన్ తిరస్కరించారు. ప్లకార్డులు పట్టుకుని పోడియంను చుట్టు ముట్టి వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఆందోళనల మధ్యే ప్రశ్నోత్తరాలను మండలి ఛైర్మన్ చేపట్టారు. వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన ఉధృతం చేయడం, సభలో గందరగోళం నెలకొనడంతో సభను కాసేపు వాయిదా వేశారు. వరుసగా ఐదు రోజుల పాటు సభా కార్యకలాపాలు నిలిచిపోవడం, సభలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళన చేస్తున్న దృష్ట్యా సభా కార్యకలాపాల నిర్వహణ కోసం మండలి బీఏసీ సమావేశమైంది. ఛైర్మన్ కొయ్యే మోషను రాజు అధ్యక్షతన సమావేశంలో సభలో ప్రజా సమస్యలపై చర్చించే విషయమై కూటమి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు చర్చించారు.

## ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం: అనిత



**అమరావతి, పతాకం న్యూస్:** జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఇక ఈ బిల్లుపై చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చట్టంలో ప్రస్తావన లేదన్నారు. జైళ్లలో ఖైదీల సంఖ్య పెరిగినా సౌకర్యాలు మాత్రం పెరగటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జైళ్ల శాఖలో 30 శాతం సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయని వివరించారు. జైళ్లలో మహిళా సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. అండర్ ట్రయల్ ఖైదీలు న్యాయ సహాయం లేకపోవడంతో జైళ్లలోనే ఉండిపోతున్నారని గుర్తు చేశారు. చిన్న చిన్న కేసుల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారి సత్ ప్రవర్తన ఆధారంగా బయటకు పంపించాలన్నారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చాక జనజీవన స్రవంతిలో కలిసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో తాము సైతం జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. జీవిత ఖైదు పడిన ఖైదులు 60 ఏళ్లు వయసు దాటిన వారికి క్షమాబిక్ష ప్రసాదించాలంటూ ప్రభుత్వానికి సూచించారు. క్షమాబిక్ష కోసం జైళ్లలోని చాలామంది ఖైదీలు ఎదురు చూస్తున్నారన్నారు. ఆ తర్వాత జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

# పోలీసుల విస్తృత తనిఖీలు



**విజయనగరం, పతాకం న్యూస్:** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, బీడీ టీంతో తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఆటో స్టాండ్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు, జన సముదాయం ఎక్కువగా ఉన్న ప్రాంతాలనూ పరిశీలించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు.

## తీరనున్న తాగునీటి కష్టాలు



**పలాస, పతాకం న్యూస్:** పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. 31 వార్డులు.. లక్షకుపైగా జనాభా ఉన్న ఈ మునిసిపాలిటీలో శాశ్వత మంచినీటి పథకాలేవీ లేవు. దీంతో వేసవి వచ్చిందంటే చాలు.. అన్నీ వార్డుల్లోనూ తాగునీటి కష్టాలే. ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసేందుకు ఏటా రూ.40లక్షలకుపైగా వెచ్చించేవారు. గత ప్రభుత్వాలు నీటి కోసం ప్రయత్నించినా విఫలమయ్యాయి. ప్రస్తుతం వంశధార ఆధారిత చెరువుల వద్ద భారీ బావులు నిర్మించి తాత్కాలిక ఉపశమనాన్ని కలిగిస్తున్నారు. నీటి కష్టాలు తొలగించేలా ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి చేశారు. దీనిపై పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.నారాయణ స్పందిస్తూ.. పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు శాశ్వత తాగునీటి పథకం కోసం రూ.121.99 కోట్లు మంజూరు చేశారు. ఇటీవల జీవో 467 విడుదల చేశారు. పలాస మండలం రేగులపాడు వద్ద శరవేగంతో నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ జలాశయం నుంచి నీటిని తీసుకువచ్చేందుకు ఈ పథకం రూపొందించబడింది. ఎమ్మెల్యే కృషి మేరకు ఇప్పటికే ఉద్దానం రక్షిత నీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నారు. దీర్ఘకాలిక అవసరాలకు ఆఫ్‌షోర్ ఆధారిత నీరు ఎంతో వినియోగపడుతోంది. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి కూడా శాశ్వత తాగునీటి పథకం మంజూరు కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైతులకు భారంగా మారిన ఎరువుల ధరలు



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో రైతన్నలకు ఎరువుల ధరలు భారంగా మారాయి. ఇప్పటికే అప్పులు చేసి రబీ సాగు చేపట్టిన వారికి.. ఎరువుల ధరలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. వాస్తవంగా జిల్లాలో 70 శాతం మంది వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. దాదాపు 2.13 లక్షల మంది 98,920 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. కాగా రబీ సీజన్‌లో అత్యధికులు మొక్కజొన్న, నువ్వులు, అపరాలు, చెరకు, అరటి తదితర పంటలు సాగు చేపట్టారు. సాగునీటి సరఫరా ఉన్నచోట్ల కొందరు వరి కూడా వేసుకున్నారు. అయితే వాటన్నింటికీ రసాయన ఎరువులు అవసరం. సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపాలని ప్రభుత్వాలు, అధి కారులు అవగాహనా కల్పిస్తున్నా.. జిల్లా వాతావరణ పరిస్థితులు అందుకు అను కూలించడం లేదు. దీంతో అన్నదాతలకు రసాయన ఎరువుల వినియోగం తప్పనిసరి అయింది. అయితే రసా యన ఎరువులు ధరలు పెరగడంతో రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా, డీఏపీ మినహా మిశ్రమ ఎరువుల తయారీకి ముడిసరుకు అవసరం. ఆ ముడి సరుకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో వీటి ధరలు అధికంగా పెరగడంతో దేశంలోని ఎరువుల ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే బహిరంగ మార్కెట్‌లో రసాయన ఎరువులు ధరలు విపరీతంగా పెరగ్గా.. మరోవైపు కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ? వ్యాపారులు చెప్పిన ధరకే ఎరువులను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా.. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ చేపడుతున్నా.. కొంతమంది వ్యవసాయశాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాజకీయ నాయకులు, అధికారుల సిఫారసులకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా సామాన్య, మధ్యతరగతి రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందని పరిస్థితి ఉంది. ఈ పంపిణీపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించాలని అన్నదాతలు కోరుతున్నారు.

## అద్దె భవనాలతో అగచాట్లు



**పాతపట్నం, పతాకం న్యూస్:** పాత పట్నంలో పలుప్రభుత్వ శాఖలు అద్దెభవనాల్లో కొన సాగుతున్నాయి. ప్రతి నెలా వేలాది రూపాయలు చెల్లి స్తుండడంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోంది. ఎక్సైజ్‌తోపాటు ఐసీడీఎస్ తదితర కీలక శాఖలు అద్దె భవనాల్లోనే కొనసాగుతుండడంతో సిబ్బందితోపాటు పనులకు వచ్చే వారు అవస్థలకు గురవుతున్నారు. పాతపట్నంలోని కోర్టుఆవరణలో భవన సముదా యాల్లో గతంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేవి. ఇక్కడఆదర్శంగా తీసుకొని జిల్లాలో పలుచోట్ల ఇలాగే నిర్మించాలని అప్పట్లో అధికారులు ప్రతిపా దనలు పంపేవారు. అయితే కోర్టు ఆవరణలో భవన సముదాయాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఈనేపథ్యంలో ఆ భవన సము దాయంలో ఉండే పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం సొంత భవనాలు సమకూర్చుకున్నాయి. స్థానిక తెంబూరురోడ్‌లో ప్రహరాజపాలెం సమీపంలో మేడపై ఎక్సైజ్‌శాఖకార్యాలయం అద్దెభవనంలో కొనసాగుతోంది. వృద్ధులు,సిబ్బంది మేడపైకి వెళ్లడానికి ఇబ్బందిపడు తున్నారు. అలాగే ఎక్సైజ్‌సిబ్బంది సీజ్‌చేసిన వాహనా లను కార్యాలయంఆవరణలో ఆరుబయట విడిచిపెడు తుండడంతో పాడవుతున్నాయి. అలాగే స్థానిక శివశంకర్ కాలనీలో అద్దెభవనంలో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయం ఇరుగ్గాఉండడంతో అంగన్‌వాడీ సిబ్బంది అవస్థలుపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు వేర్వేరు చోట్ల ఉండడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారంతా అవస్థలకు పడుతున్నారు. ఈనేపథ్యం లో అధికారులు చొరవచూపికార్యాలయాలన్నీ ఒకేచోట నిర్వహించి అద్దె భవనాల సమస్య నుంచి గట్టెక్కించ లని పలువురు కోరుతున్నారు.

## జంఝావతి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల



**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువల నుంచి నీటిని విడుదల చేశారు. కొమరాడ, పార్వతీపురం, గరుగుబిల్లి, సీతానగరం మండలాల్లో చెరువులను నింపుకొనేందుకు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీరు విడుదల చేసినట్లు జేఈ పత్తిక పవన్‌కుమార్ తెలిపారు. జంఝావతి ప్రాజెక్టు నుంచి సుమారు 50 క్యూసెక్కుల మేర సరఫరా చేస్తున్నామని, సాగునీటి సామర్థ్యాన్ని అనుసరించి ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. నీరు వృ?థా కాకుండా ఉండేందుకు ఓటీలను మూసివేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రధాన కాలువల నుంచి నీరు సరఫరా కావడంతో రైతులు ఆరుతడి పంటలకు సన్నద్ధమవుతున్నారు.

## ఉపాధ్యాయిని ఆత్మహత్య

**బొబ్బిలి, పతాకం న్యూస్:** బొబ్బిలి కుమ్మరి వీధి లో భర్త వేధింపులు తాళలేక ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యా యిని ఇంట్లో చున్నీతో తెల్లవారుజామున ఉరిపోసు కుంది. సీఐ కింతలి నారాయణరావు కథనం మేరకు.. స్థానిక చైతన్య స్కూల్‌లో లెక్కలు టీచరుగా సుంకరి మాధవీదేవి (39) పనిచేస్తోంది. 16 ఏళ్ల కిందట బాడంగి మండలంలోని చినభీమవరానికి చెందిన మర్రి నరేశ్‌ను ప్రేమించి పెద్దల సమక్షంలో రిజిస్టర్ వివాహం చేసుకుంది. అప్పట్లో నోబుల్ స్కూల్‌లో పనిచేసే నరేశ్ ప్రస్తుతం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారికి 13 ఏళ్ల కుమార్తె సహస్ర, 15 ఏళ్ల నవదీప్ ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత మద్యానికి బానిసైన నరేశ్ ప్రతిరోజూ మద్యం సేవించి మాధవీదేవిని హింసిస్తుండేవాడు. ఇతరులెవరైనా ఫోన్ కాల్ చేస్తే అనుమానించి తాగి వచ్చి రోజంతా ఆమెతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం రాజాం పోలిపల్లి అమ్మ వారి దర్శనానికి వెళ్లాలని ముందురోజు రాత్రి అనుకున్నారు. ఇద్దరు పిల్లలు అమ్మమ్మగారి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఇంట్లో మాధవీదేవి, నరేశ్ మాత్రమే ఉన్నా రు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మాధవీదేవికి బంధువైన కిశోర్‌కు ఆమె భర్త నరేశ్ ఫోన్ చేసి ఆమె ఉయ్యాల చైన్‌కి చున్నీ కట్టి ఉరిపోసుకొన్నట్లు సమాచారం అందించాడు.

# పెళ్లికి కొన్ని గంటల ముందే ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య



**రాజస్థాన్, పతాకం న్యూస్:** రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే విషాదం చోటుచేసుకుంది. ఒకే పందిరిలో పెళ్లి పీటలు ఎక్కి కొత్త జీవితాన్ని ప్రారంభించాల్సిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు, పెళ్లికి కొద్ది గంటల ముందే ప్రాణాలు తీసుకోవడం స్థానికంగా పెను కలకలం రేపింది. వధువులైన శోభ (25), విమ్లు (23) ఇద్దరూ ప్రైవేట్ స్కూల్ టీచర్లుగా పనిచేస్తున్నారు. శనివారం వీరిద్దరికీ వివాహం జరగాల్సి ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు ఇంట్లో పెళ్లి వేడుకలు, సంప్రదాయ 'బంధోలి' వేడుకలు సందడిగా సాగాయి. అయితే, శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వీరిద్దరి ఆరోగ్య పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాలను ఇంటికి తెచ్చి, పోలీసులకు చెప్పకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బాధితుల మేనమామ జస్వంత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. "మరో ఐదు నిమిషాలు ఆలస్యమైతే పోలీసులు వచ్చేలోపే అంత్యక్రియలు పూర్తి చేసేవారు" అని ఆయన పేర్కొన్నారు. మృతదేహాలు నీలి రంగులోకి మారాయని, ఇది విష ప్రయోగం వల్ల జరిగిన ఆత్మహత్యేనని ఆయన ఆరోపించారు. బాధితుల తండ్రి సోదరులు (బాబాయిలు) ఈ పెళ్లి విషయంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారని జస్వంత్ సింగ్ ఆరోపిస్తున్నారు. మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దు చేసి, బాబాయిల ఒత్తిడి మేరకు పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పెళ్లి నిశ్చయించారని, ఈ బలవంతపు పెళ్లి ఇష్టం లేకనే సోదరీమణులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రాథమిక దర్యాప్తులో పురుగుల మందు తాగినట్లు ఆధారాలు లభించాయి. అయితే, ఘటనా స్థలంలో ఎటువంటి ఆత్మహత్య లేఖ లభించలేదని, కుటుంబ సభ్యులందరినీ విచారిస్తున్నామని ఏడీసీపీ రోషన్ మీనా తెలిపారు.

# రాజమహేంద్రవరంలో అనారోగ్య కలకలం.. పలువురు ఆసుపత్రిపాలు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం నగరంలోని లాలాచెరువు ప్రాంతంలో పలువురు ఒకేసారి అనారోగ్యం బారినపడటం కలకలం రేపుతోంది. స్థానిక చౌడేశ్వర నగర్, స్వరూప్‌నగర్‌లలో బాధితులు అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. వారిలో కొందరికి కిడ్నీలు పాడైనట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో రోజూ ఓ వ్యక్తి వచ్చి పాలు పోసేవాడని, ఆ పాలు తాగిన వారంతా ఇలా అనారోగ్యం బారినపడినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వైద్యశాఖ అధికారులు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో అనారోగ్యానికి కారణాలు, వివరాలు సేకరిస్తున్నారు. కోరుకొండ మండలానికి చెందిన పాలు పోసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# అనంతబాబు కేసులో నలుగురు పోలీసు అధికారుల సస్పెన్షన్



**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో పోలీసులు కుమ్మక్కు అయ్యారంటూ సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. 2022, మే 19న జరిగిన హత్య కేసు విచారణలో నిందితుడైన అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించిన నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణలో లోపాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు డిఫాల్ట్ బెయిల్ అందించడానికి అన్ని ప్రయత్నాలు జరిగాయని, అత్యంత హేయమైన నేరంలో పోలీసుల తీరు ఆక్షేపణీయమని సుప్రీం కోర్టు మండిపడింది. కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి నిందితులకు కొమ్ము కాసిన పోలీసులపై ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసింది. అప్పటి పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో కేసులో కీలక ఆధారాలు కావాలని విస్మరించి నిందితుడైన అనంతబాబుకు సహకరించిన నలుగురు పోలీస్ అధికారులపై డీజీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. సస్పెండ్ అయిన వారిలో కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన అప్పటి కాకినాడ డీఎస్పీ, ప్రస్తుతం భీమవరం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న వి.భీమారావు, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, అప్పట్లో సర్పవరం సీఐగా పనిచేసి ప్రస్తుతం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆకుల మురళీకృష్ణ, అప్పట్లో కేసు నమోదైన సర్పవరం స్టేషన్ ఎస్ఐగా ఉండి, ప్రస్తుతం కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎన్.సతీష్ బాబు ఉన్నారు. ఈ పోలీసు అధికారులపై వెంటనే క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

# మళ్లీ కళకళలాడుతున్న బీసీ స్టడీ సర్కిళ్లు

**అమరావతి, పతాకం న్యూస్:** బీసీ సివిల్స్ స్టడీ సర్కిల్స్ వెనకబడిన తరగతుల విద్యార్థులకు భరోసాగా నిలుస్తున్నాయి. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు సివిల్స్ వంటి ఉన్నత పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసింది. వీటి వల్ల గ్రామీణ, పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పోటీ పరీక్షలకు అన్నివిధాలా ప్రభుత్వం అండగా నిలుస్తోందంటూ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో బీసీ స్టడీ సర్కిళ్లు నిర్లక్ష్యానికి గురి కాగా కూటమి ప్రభుత్వంలో మళ్లీ అభ్యర్థుల శిక్షణా తరగతులు కళకళలాడుతున్నాయి.

సివిల్స్ పోటీ పరీక్షలకు సిద్ధమవడమంటే వ్యయప్రయాసలు భరించాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ, పేద, వెనకబడిన తరగతుల విద్యార్థులు సివిల్స్ పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 3వేల మంది ప్రవేశ పరీక్ష రాయగా 100 మంది శిక్షణా తరగతులకు అర్హత సాధించారు. ఇక్కడ ఉచితంగా కోచింగ్, నాణ్యమైన స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, పరీక్షలు, ఇంటర్వ్యూ నైపుణ్యాలు అందిస్తున్నారు.

తరగతులతోపాటు అదనపు స్టడీ అవర్స్ కొనసాగిస్తున్నారు. వారానికి రెండుసార్లు పరీక్ష పెట్టి అభ్యర్థుల్లోని శక్తిసామర్థ్యాలు, పోటీతత్వాన్ని తట్టి లేపుతున్నారు. ప్రభుత్వ శిక్షణ కేంద్రాలంటే సరైన వసతులు ఉండవనే అపోహలకు తావులేకుండా భోజన, వసతి సదుపాయాల్లో ఏమాత్రం లోటు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లక్షల రూపాయల విలువైన



సివిల్స్ శిక్షణ తరగతులను ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఉచితంగా అందించడం పట్ల అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సివిల్స్‌కి ప్రిపర్అవ్వాలంటే చాలా ఖర్చు అవుతుంది. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకి చాలా పోటీ ఉంటుంది. పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన సివిల్స్? కోచింగ్? అందించాలనే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించాం. ప్రతీరోజు ఉదయం 6.30 నుంచి 1.30 వరకు క్లాసులు జరుగుతాయి. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు స్టడీ అవర్స్ ఉంటాయి. క్లాస్లులకి సంబంధించి ఏ సందేహం ఉన్నా అదే రోజు నివృత్తి చేస్తారని బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్, తనూజా రాణి తెలియజేశారు.

గత ప్రభుత్వంలో బీసీ స్టడీ సర్కిళ్లు నిరాదరణకు గురికాగా కూటమి ప్రభుత్వంలో మళ్లీ శిక్షణ కార్యక్రమాలు జోరందుకున్నాయి. ప్రస్తుతం అన్ని జిల్లాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తున్నారు. సివిల్స్ కోచింగ్ మాత్రం ప్రస్తుతం విజయవాడ గొల్లపూడిలోనే అందిస్తున్నారు. భవిష్యత్తులో విశాఖ, తిరుపతి, అనంతపురంలోనూ సివిల్స్ బీసీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోంది. సివిల్స్ కోచింగ్ పరీక్షలు ప్రీమియం కావడంతో శిక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని, అభ్యర్థులు తెలియజేస్తున్నారు.

# నీటి హక్కులపై రాజీ పడం: రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు నదీ జలాలను మళ్లించేందుకు తాను మద్దతిస్తున్నానంటూ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. ములుగు జిల్లాలో దేవాదుల ప్రాజెక్టుపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. నీటి సమస్యలపై చౌకబారు ఆరోపణలు చేస్తూ ప్రజలకు సంబంధించిన అంశాలను రాజకీయం చేయవద్దని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. అవసరమైతే తాము పొరుగు రాష్ట్రాలతో చర్చిస్తామని, కానీ తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో వెనకడుగు వేయబోమని అన్నారు. గోదావరి జలాల అంశంపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కేసీఆర్, హరీశ్ రావు తమ విలువైన సలహాలు ఇవ్వాలని సూచించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ వివాదాలు ఉండేవి కావని సీఎం చురకలంటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి, ఇతర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. "కాళేశ్వరం వారి సొంత ఆస్తి కాదు. అది ప్రజల డబ్బు. దాన్ని వృథాగా పోనివ్వం. తిరిగి వినియోగంలోకి తెస్తాం" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. నిధుల కొరత ఉన్నప్పటికీ, రెండేళ్లలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 6,000 కోట్ల నుంచి రూ. 18,500 కోట్లకు పెరిగిందన్నారు. భూసేకరణ కోసం జూన్ 2 లోగా రూ.



600 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. అన్ని ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, గ్రీన్ ఛానల్ ద్వారా పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# వంట నూనెల కల్తీ కలకలం

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం ప్రతినిధి వంట నూనెల కల్తీ కలకలం మొదలైంది. కాకినాడ జిల్లా ధర్మవరం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేయగా.. కల్తీ నూనె పెద్ద ఎత్తున పట్టుబడిన విషయం విదితమే. ఈ ఘటనలో తొమ్మిది మందిని అరెస్టు చేసి.. వారి నుంచి 840 కిలోల నూనెను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు నెలలుగా ఈ దందా కొనసాగుతోందని పోలీసులు గుర్తించారు. నూనెలో క్రూడాయిల్ కలిపినట్టు తేలడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో నూనె, నెయ్యిలో కల్తీ జరుగుతుందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కొంతమంది నూనెను యథేచ్ఛగా కల్తీ చేసి విక్రయిస్తూ.. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. నాణ్యత లేని నెయ్యి, నూనె సరఫరా జరుగుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. జిల్లాలో ఎక్కువగా సన్‌ఫ్లవర్, పామాయిల్, రైస్‌బ్రాన్, వేరుశెనగ నూనెను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అన్నీరకాలు కలిపి నెలకు దాదాపు 1700 టన్నుల నూనె విక్రయిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతినెలా సుమారు రూ.15 కోట్ల మేర నూనె వ్యాపారం సాగుతోంది. చిన్న, మధ్యతరహా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో అధికంగా పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెను ఎక్కువగా వాడుతున్నారు. మిగిలిన వాటి కంటే తక్కువ ధరకు లభిస్తుండడంతో చాలామంది వీటికే మొగ్గు చూపుతున్నారు. అదే విధంగా నెయ్యిలో కూడా కల్తీ జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. సాధారణంగా నెయ్యిని రెండు రకాలుగా ఉత్పత్తి చేస్తారు. ఇళ్లలో పెరుగు చిలికే క్రమంలో వచ్చే వెన్నను కాయడం ద్వారా తయారు చేసేది 10 నెలలైనా నిల్వ ఉంటుంది. యంత్రంతో పాలుపోసి ఆడించిన తరువాత వచ్చే వెన్నను మరిగించి రెండో రకంగా నెయ్యిని తయారుచేస్తారు. దీని నాణ్యత నెల రోజుల తరువాత తగ్గిపోతుంది. జిల్లాలో రెండో రకం నెయ్యి ఉత్పత్తి, విక్రయాలు జరుగుతున్నాయి. అందులోనూ వనస్పతి, పామాయిల్ కలిపేసి కొందరు కల్తీ చేస్తున్నారు. బేకరీ, స్వీటుషాపు నిర్వాహకులు తక్కువ ధరకు లభించే కల్తీ నెయ్యి, నూనెను కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో నెలకు 50వేల లీటర్ల నెయ్యి విక్రయిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రకం, నాణ్యత బట్టి కిలో నెయ్యి రూ.350 నుంచి



రూ.1000 వరకూ అమ్ముతున్నారు. రూ.2.50 కోట్ల మేర వ్యాపారం జరుగుతోంది. జిల్లాలో వేల టన్నుల నూనె, నెయ్యి విక్రయాలు జరుగుతున్నాయి. వందల కొలదీ వ్యాపారులు ఉన్నారు. కానీ ఆహార పదార్థాల కల్తీ నియంత్రణకు చర్యలు నామమాత్రమేనని తెలుస్తోంది. నగరంలోనే తోపుడుబండ్లు, చిన్న, మధ్యతరహా హోటళు ,, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు సుమారు 1000వరకూ ఉన్నాయి. 18 మండలాల్లో ఆ సంఖ్య 8 వేల వరకూ ఉండొచ్చని ఒక అంచనా. నూనె, నెయ్యి సరఫరాదారులు 500 మంది వరకూ ఉంటారు. కల్తీ జరగకుండా నియంత్రించాల్సిన ఇన్‌స్పెక్టర్లు సంఖ్య తక్కువగా ఉండటంతో ఎక్కడా తనిఖీలు సక్రమంగా జరగడం లేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

## మీ-సేవల మనుగడను కాపాడాలి



**పల్నాడు, పతాకం న్యూస్:** మీ-సేవల మనుగడను కాపాడాలని మీ-సేవ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోరుమామిళ్ల రాము విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట పట్టణంలో గీతామందిరంలో జరిగిన ఎపి మీ-సేవ నిర్వాహకుల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో రాము మాట్లాడుతూ 25 ఏళ్లుగా మీ-సేవల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తూ చాలీచాలని ఆదాయంతో బతుకుతున్న ఆపరేటర్ల మనుగడ ప్రశ్నార్ధకమైందన్నారు. వైసిపి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. నాడు యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్‌కు సమస్యలు వివరించగా అధికారంలోకి రాగానే మీ-సేవలకు పూర్వ వైభవం తీసుకొస్తామని, ఆపరేటర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. అనంతరం అసోసియేషన్ పల్నాడు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా నూతన అధ్యక్షులుగా గట్టుపల్లి మహేష్, ఉపాధ్యక్షులుగా కొత్త శేషగిరిరావు గౌరవాధ్యక్షులుగా కొమ్ము ప్రకాష్, దాసరి రాజశేఖర్, వేల్పూరు గణపతిజ్, ప్రధాన కార్యదర్శిగా జలసూత్రం హరిబాబు, కార్యదర్శిగా రాయుడు సతీష్, నూలి శ్రీను, కాట్ల రామాంజనేయులు, మహిళా కార్యదర్శి గాదె శాంత కుమారి ఎన్నికయ్యారు.

## సునీల్ కుమార్ సస్పెన్షన్ మరోసారి పొడిగింపు

**అమరావతి, పతాకం న్యూస్:** సీఐడీ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి పీవీ. సునీల్ కుమార్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. సస్పెన్షన్‌ను మరో సారి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, అప్పీల్ నియమాల ఉల్లంఘన కింద సస్పెన్షన్ పొడిగించారు. సునీల్ కుమార్‌పై కీలకమైన క్రిమినల్ కేసులు పూర్తయ్యే వరకు లేదా పదవీ విరమణ తేదీ 30 జూన్ 2026 వరకు సస్పెన్షన్ పొడిగింపు వర్తిస్తుందని ఆదేశాల్లో తెలిపింది. ఈ రెండింటిలో ఏది ముందుగా వస్తే అప్పటి వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. వైఎస్సార్సీపీ హయాంలో ఎంపీగా ఉన్న తనను కస్టోడియల్ టార్చర్‌కు గురి చేశారంటూ సునీల్ కుమార్ పై ఫిర్యాదు చేసిన ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వ అనుమతి లేకుండా వేరే దేశాలకు వెళ్లారన్న అభియోగాలపై తొలిసారి సస్పెన్షన్ వేటు వేశారు.

## టిడ్కో ఇళ్ల వద్ద రూ.3.60 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్



**చిలకలూరిపేట, పతాకం న్యూస్:** 52 ఎకరాల్లోని 5520 టిడ్కో ఇళ్లలో నిసించే వారికి ఉపయోగపడేలా, స్థానిక కొన్ని కుటుంబాలకు ఉపాధి కల్పించేలా దుకాణాల సముదాయాన్ని రూ.3.60 కోట్లతో నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. దుకాణ సముదాయానికి శంకుస్థాపన చేసిన ఆయన మాట్లాడుతూ 6 నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం టిడ్కో ఇళ్లను పరిశీలించి వాటిల్లో నివాసం ఉంటున్న వారితో మాట్లాడారు. సమస్యలేమైనా ఉంటే అధికారులు లేదా తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. టిడ్కో వాసులు ఏమైనా ఇబ్బందులను చెబితే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక మద్ది నగర్‌లో రూ.30 లక్షలతో నిర్మించే ముస్లిమ్ కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ భవనాన్ని భవిష్యత్‌లోనూ మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి సమన్వయకర్త ఎన్.సదాశివరావు, జనసేన ఇన్‌ఛార్జి టి.రాజారమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరి, మండల అధ్యక్షులు జె.మధన్ మోహన్, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి ఎం.రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పి.కోటేశ్వరరావు, కౌన్సిలర్ జె.సుజాత, బేరింగ్ మౌలాలి, పి.శివమ్మ, నాయకులు బి.శ్రీనివాసరావు, జి.రమేష్, మున్సిపల్ డిఇ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

## జిల్లా జైలును సందర్శించిన జిల్లా కమిటీ

**గుంటూరు, పతాకం న్యూస్:** జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కూడిన జిల్లా కమిటీ జిల్లా జైలును సందర్శించింది. పురుషులు, మహిళల వార్డులను పరిశీలించారు. జైలులో ఉన్న ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతుల నాణ్యత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కుల వివక్షలు వంటి సమస్యలు ఉన్నాయా అని ఆరా తీసారు. జైలు సూపరింటెండెంట్ ఎ.బి.కాంత రాజు జైలులో వసతి సౌకర్యాలు, నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.కార్యక్రమంలో ఆర్‌డిఓ కె.శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ జి.వి.రమణమూర్తి, డి.ఎస్పీ అరవింద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కొండంత అండ సీఎం సహాయనిధి: మంత్రి దుర్గేష్




**నిడదవోలు, పతాకం న్యూస్:** నిడదవోలు నిరుపేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ.9,45,512 విలువైన చెక్కులు, ఎల్‌ఓసి పత్రాలను ఆయన పంపిణీ చేశారు. అందులో 25 మందికి రూ.28,83,778 విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను, ఒకరికి రూ.61,734 విలువైన ఎల్‌ఓసి పత్రాన్ని మంత్రి దుర్గేష్ అందజేశారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకూ సిఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసి మరియు ప్రత్యేక ఆర్థిక సాయం కింద మొత్తం 635 మందికి రూ.4,85,87,498 లబ్ధి చేకూర్చామని వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా హెల్దీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 'ఆరోగ్యం ఉంటేనే సంపద ఉంటుంది, అప్పుడే సమాజం సంతోషంగా ఉంటుంది. అందుకే ప్రస్తుత బడ్జెట్‌లో ఆరోగ్య శాఖకు సుమారు రూ. 19,000 కోట్లు కేటాయించారు. 863 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది.' అని మంత్రి దుర్గేష్ వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దరఖాస్తు చేసుకున్న తక్కువ కాలంలోనే నిధులు విడుదలయ్యేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రజల కోసం ఇంత చేస్తున్న ప్రధాని మోదీని, సిఎం చంద్రబాబును, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కూటమి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించా లన్నారు. మంచి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వామ్యులై ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. తద్వారా మనల్ని, సమాజాన్ని బాగు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎక్కువ సేపు కూర్చుని పనిచేస్తున్నారా? ఈ వ్యాధులు రావాచ్చు!

ఎక్కువ సేపు కూర్చుని పనిచేస్తున్నారా..? అయితే ఈ వ్యాధులు వస్తాయి జాగ్రత్త..! కార్పొరేట్ ఉద్యోగం చేసేవారందరూ కూడా ఎక్కువ సమయం కూర్చొని పని చేస్తూ ఉంటారు. అలాగే గమ్యస్థానాలకు చేరుకునే వారు కూడా ట్రాఫిక్ కారణంగా, దూరం కారణంగా ఎక్కువ సమయం కూర్చొని ఉంటారు. అలాగే కొందరు ఫోన్ ను లేదా టీవీని చూస్తూ ఎక్కువ సమయం కూర్చొని ఉంటారు.

కార్పొరేట్ ఉద్యోగం చేసేవారందరూ కూడా ఎక్కువ సమయం కూర్చొని పని చేస్తూ ఉంటారు. అలాగే గమ్యస్థానాలకు చేరుకునే వారు కూడా ట్రాఫిక్ కారణంగా, దూరం కారణంగా ఎక్కువ సమయం కూర్చొని ఉంటారు. అలాగే కొందరు ఫోన్ ను లేదా టీవీని చూస్తూ ఎక్కువ సమయం కూర్చొని ఉంటారు. ఇలా ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల శరీరానికి హాని కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. కండరాలు దెబ్బతినడం, జీవక్రియ నెమ్మదించడం, వెన్ను నొప్పి రావడం, హృదయ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు. ఎక్కువ సమయం కూర్చోవడం ధూమపానంతో సమానమని వారు చెబుతున్నారు. ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలు వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుందని, ఆందోళనతో పాటు భయం కలుగుతున్న భావన కూడా వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రోజుకు 11 లేదా అంతకంటే ఎక్కువ గంటల పాటు కూర్చోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం 1.40 రెట్లు ఎక్కువగా ఉటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల గుండె కండరాలు బలహీనంగా తయారవుతాయి. గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక శరీరాన్ని సాగదీసే సరళమైన వ్యాయామాలు చేయాలి. గుండె ఆరోగ్యాన్ని మార్చుకోవడానికి జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. కూర్చోవడం వల్ల, సరైన భంగిమలో కూర్చోకపోవడం వల్ల దీర్ఘకాలిక నడుము నొప్పి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నడుము నొప్పి మొత్తం జీవనాణ్యతను తగ్గిస్తుంది. కొన్ని సార్లు చాలా మంది తమ పనులను తాము కూడా స్వయంగా చేసుకోలేకపోతారు. కనుక కండరాలకు ప్రాధాన్యతను ఇచ్చే వ్యాయామాలు, పని శైలిని మార్చుకోవడం ద్వారా నడుము నొప్పి సమస్యని అధిగమించవచ్చు. ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల జీవక్రియ నెమ్మదిస్తుంది. దీంతో ఊబకాయం, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక ఎంత సమయం కూర్చుంటున్నారు అనే అంశాలపై దృష్టి పెట్టడం చాలా అవసరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక కాళ్లు, చేతుల కండరాలు కూడా ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల ప్రభావితమవుతాయి. కండరాల ఆరోగ్యం క్రమంగా క్షీణించే అవకాశం ఉంది. కనుక విరామం తీసుకుంటూ కూర్చోవడం, కండరాల వ్యాయామాలు చేయడం వంటివి చేయాలి. ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల డీప్ వెయిన్ థ్రాంబోసిస్ అనే అనారోగ్య సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది.

ఎక్కువ సమయం వంగి కూర్చోవడం వల్ల కండరాల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతుంది. కీళ్లు, వెన్నెముక నిర్మాణంలో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. వెన్నెముక వంగడం, తల, మెడ స్థానాలు బలహీనపడడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల ఆందోళన, నిరాశ వంటి భావాలు అభివృద్ధి చెందుతాయి. మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల ఇలా అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని ఎక్కవ సమయం కదలకుండా కూర్చోవడం శరీరానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు.

# లంబసింగిలో కొండలపై ఇగ్లూ తరహా టెంట్లు

## రూ.14 కోట్లతో పునరుద్ధరణ పనులు



**లంబసింగి, పతాకం న్యూస్:** పర్యాటకులకు అరుదైన ఆతిథ్యాన్ని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ అందిస్తోంది. పచ్చని కొండల పై ప్రకృతి అందాల నడుమ సందర్శకులను ఆకట్టుకునేలా 'టెంట్ సిటీ'లు నిర్మిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగి, టైడాలో ఈ ప్రాజెక్టులు చేపట్టారు. టైడాలో నిర్మాణాలు ఇప్పటికే పూర్తియ్యాయి. ప్రస్తుతం వీటిని అందుబాటులోకి తీసుకు వచ్చారు.

ఈ టెంట్ల నిర్మాణానికి కొరియా నుంచి ఫ్యాబ్రిక్ దిగుమతి చేశారు. వీటిని ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. ఒక్కో టెంట్? సైడ్ వాల్స్ 7 అడుగులు ఉంటున్నాయి. మధ్యలో పన్నెండు అడుగుల ఖాళీ ప్రదేశం ఉంటుంది.

ట్రయాంగిల్, ఇగ్లూ నమూనాల్లో నిర్మాణాలు : వేడి, చల్లదనాన్ని నియంత్రించేలా 3,4 పొరలతో ఆకట్టుకునేలా టెంట్?లు నిర్మిస్తున్నారు. లోపల అన్ని రకాల వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేక పడక గది, పందిరి మంచం, ఆరుబయట కుర్చీలు, టీవీ సౌకర్యం, విద్యుత్తు అలంకరణలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పచ్చదనం మధ్యలో బయట ఆహ్లాద వాతావరణం కనిపించేలా గ్లాసులతో టెంట్లు నిర్మించడం వీటి ప్రత్యేకత. వెన్నెల రోజుల్లో మరింత మనోహరంగా ఉంటుంది.

గతంలో 'టైడా' వద్ద జంగిల్ బెల్స్‌లో వెదురుతో గదులు నిర్మించారు. అవి శిథిలమయ్యాయి. ప్రస్తుతం వాటి స్థానంలో కొత్తగా టెంట్ సిటీ నిర్మించారు. ఇక్కడ 12 గదులు పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయి. ఎంతోమంది ప్రముఖులు వీటి పై ఆసక్తి చూపిస్తున్నారు. ఒకసారి వచ్చినవారు మళ్లీ మళ్లీ సరదాగా గడపాలని వస్తున్నారు.

అరకులో వ్యాలీ రిసార్టులో 68 గదులు, మయూరి రిసార్టులో 101 గదులను పూర్తిగా నవీకరించారని ఏపీటీడీసీ డీవీఎం జి.జగదీష్ అన్నారు. ఆధునిక వసతులతో సిద్ధం చేసారని తెలిపారు. మయూరి వద్ద బడ్జెట్లో నిర్మించిన అమీబా గదులు 12 అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. రూ.14 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపట్టామన్నారు.

విశాఖ అప్పూఘర్ రిసార్టులో 100 మందికి సరిపడే హాలు అన్ని రకాలుగా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. అరకులోనూ ఒక హాలు ఉంది. టైడాలోని టెంట్లకు బడ్జెట్ అవి రూ.2,940, ఏసీ ప్రీమియం రూ.4,200 ఉండగా, ఏసీ డీలక్స్ రూ.3,360, ఇక ఏసీ లగ్జరీకి రూ.5,250గా ధరలు నిర్ణయించమని పేర్కొన్నారు.

హైదరాబాద్ నుంచి ఐటీ ఉద్యోగులు వీకెండ్‌లో సరదాగా గడిపేందుకు వాహనాలు బుక్ చేసుకొని మరీ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వీటికి డిమాండ్ భారీగా ఉంది. దీంతో లంబసింగిలో ఇప్పటికే 15 గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం రూ.4 కోట్లు ఖర్చు చేస్తున్నారు. త్వరలో ఇక్కడ కొండలపై సమతల ప్రదేశాన్ని అభివృద్ధి చేసి ఇగ్లూ తరహా టెంట్లు నిర్మించనున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పును ఖాతరు చేయని ట్రంప్...

## టారిఫ్‌లు 10 శాతం నుంచి 15 శాతానికి పెంపు



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ వాణిజ్యంపై మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా దిగుమతులపై టారిఫ్‌ను 10 శాతం నుంచి 15 శాతానికి పెంచుతున్నట్లు శనివారం ప్రకటించారు. అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. తన ట్రూత్ సోషల్ ఖాతాలో ట్రంప్ ఈ వివరాలను పోస్ట్ చేశారు. "దశాబ్దాలుగా ఎన్నో దేశాలు అమెరికాను మోసం చేస్తున్నాయి. వాటిపై ఎవరూ ప్రతీకారం తీర్చుకోలేదు. నేను వచ్చిన తర్వాతే పరిస్థితి మారింది" అని ఆయన పేర్కొన్నారు. టారిఫ్‌లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును "అసంబద్ధమైనది, అమెరికాకు వ్యతిరేకమైనది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ తీర్పు తర్వాత ఎంతో ఆలోచించి కొత్త టారిఫ్‌లను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈసారి న్యాయపరమైన చిక్కులు రాకుండా సుంకాలు పెంచామని పేర్కొన్నారు. "సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించిన అనంతరం, 10 శాతం ప్రపంచవ్యాప్త టారిఫ్‌ను 15 శాతానికి పెంచుతున్నాను. ఇది పూర్తిగా చట్టబద్ధమైనది" అని ట్రంప్ తన పోస్ట్‌లో వివరించారు. రాబోయే నెలల్లో మరిన్ని సుంకాలను విధిస్తామని, ఇది తన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఎజెండాలో భాగమని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ టారిఫ్ విధానాలకు సుప్రీంకోర్టు తీర్పు ఎదురుదెబ్బగా భావిస్తున్న తరుణంలో, ఆయన ప్రత్యామ్నాయ చట్టపరమైన మార్గాల ద్వారా తన విధానాలను ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, ఈ నిర్ణయం ప్రపంచ వాణిజ్యం, వస్తువుల ధరలు, ఇతర దేశాలతో అమెరికా సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## 7వ రోజుకు చేరిన సహకార ఉద్యోగుల సమ్మె

**కాకినాడ, పతాకం న్యూస్:** తమ సమస్యల పరిష్కారం కోసం సహకార ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారంతో 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సామర్లకోట బ్రాంచ్, పెద్దాపురం బ్రాంచ్ పరిధిలోని సహకార ఉద్యోగులు బ్రాంచ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సామర్లకోట బ్రాంచ్ డైరెక్టర్ పోరాడు మారుతి బాబు, పెద్దాపురం బ్రాంచ్ డైరెక్టర్ గుణ్ణం వీర వెంకట సత్యనారాయణ లు మాట్లాడుతూ ... తమ డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మెను విరమించేది లేదని ప్రకటించారు.




# టీమిండియా ఘోర ఓటమి



డిఫెండింగ్ ఛాంపియన్ చతికిల పడింది. సూపర్8 పోరులో దక్షిణాఫ్రికాకు కనీస పోటీ ఇవ్వలేదు. 188 పరుగుల ఛేదనలో భారత బ్యాటర్లు సమిష్టిగా విఫలమయ్యారు. శివం దూబె (42, 37 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) మినహా అందరూ నిరాశపరిచారు. ఇషాన్ కిషన్ (0), తిలక్ వర్మ (1), అభిషేక్ శర్మ (15) పవర్‌ప్లేలోనే నిష్క్రమించగా.. మిడిల్ ఓవర్లలో సూర్యకుమార్ యాదవ్ (18), వాషింగ్టన్ సుందర్ (11), హార్దిక్ పాండ్య (18), రింకు సింగ్ (0)ను కట్టడి చేసిన దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. 18.5 ఓవర్లలో భారత్ 111 పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. డేవిడ్ మిల్లర్ (63, 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవాల్డ్ బ్రెవిస్ (45, 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (44 నాటౌట్, 24 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరవటంతో 187 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. పేలవంగా పడిపోయారు : భారత్ లక్ష్యం 188 పరుగులు. గతంలో ఈ నల్లమట్టి పిచ్‌పై సఫారీలను చిత్తు చేశారు. కానీ ఎడమ చేతి బ్యాటర్లకు ఆఫ్ స్పిన్‌తో సవాల్ విసిరిన దక్షిణాఫ్రికా తొలి ఓవర్లోనే ఆతిథ్య జట్టుకు షాక్ ఇచ్చింది. ఎడెన్ మార్క్రామ్‌పై ఎదురుదాడి చేయబోయి ఇషాన్ కిషన్ (0), అనవసర షాట్‌తో తిలక్ వర్మ (1) వికెట్ కోల్పోయారు. చక్కని బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన అభిషేక్ శర్మ.. రబాడ ఓవర్లో ఓ సిక్సర్‌తో ఊపందుకున్నాడు. కానీ, నియంత్రణ లేకపోవటం, డాట్స్ బాల్స్ ఒత్తిడికి అభిషేక్ తలొగ్గాడు. యాన్సెన్ ఓవర్లో గాల్లోకి క్యాచ్ ఇవ్వగా.. బాచ్ అద్భుత రీతిలో అందుకున్నాడు. దీంతో 26/3తో భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. ఓ ఎండ్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (18) నిలిచినా.. దూకుడుగా ఆడేందుకు ఇబ్బంది పడ్డాడు. సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగటంతో ఒత్తిడిలో అనవసర షాట్లు ఆడారు. హార్దిక్ పాండ్య (18), రింకు సింగ్ (0), అర్ష్‌దీప్ సింగ్ (1) నిరాశపరిచారు. మిడిల్ ఓవర్లలో (7-16) ఐదు వికెట్లు కోల్పోయిన భారత్ 70 పరుగులే చేసింది. ఇక్కడే మ్యాచ్‌పై దక్షిణాఫ్రికా పట్టు బిగించింది.

## సంక్లిష్టంగా మారిన భారత్ సెమీస్ ఆశలు!



టీ20 ప్రపంచ కప్ 2026 లీగ్ స్టేజ్‌ను అజేయంగా ముగించిన టీమిండియా.. సూపర్ 8లో తొలి మ్యాచ్‌లోనే బోల్తా పడింది. గ్రూప్ దశలో అసోసియేట్ దేశాలపై కాస్త తడబడినా గెలుపు ముగింట నిలవడంతో ఊపిరి పీల్చుకున్నాం. కానీ బలమైన సౌతాఫ్రికాపై విజయం సాధించేందుకు భారత జట్టు చెమటోడ్చింది. అయినా.. 76 పరుగుల భారీ తేడాతో సఫారీలపై ఓటమిని చవిచూసింది. దీంతో టీ20 ప్రపంచ కప్ మ్యాచుల్లో టీమిండియా వరుస విజయాలకు(12) బ్రేక్ పడింది. అయితే సెమీస్ అవకాశాలు మాత్రం కాస్త సంక్లిష్టమయ్యాయి. దారులైతే పూర్తిగా మూసుకుపోలేదు. కానీ టీమిండియా ప్రధాన కోచ్ గంభీర్ వ్యూహాత్మక ప్రయోగాలు.. ఆటగాళ్ల తీరు మారకపోతే మాత్రం చాలా కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ సెమీ ఫైనల్స్‌కు చేరాలంటే..టీమిండియాపై విజయంతో సౌతాఫ్రికా 2 పాయింట్లతో గ్రూప్ 1లో తొలి స్థానంలో నిలిచింది. భారీ పరుగుల అంతరాయంతో ఓడటంతో టీమిండియా నెట్ రన్‌రేట్ -3.800గా ఉంది. సూపర్ 8లో భారత్.. జింబాబ్వే, వెస్టిండీస్ జట్లతో మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే టీమిండియా ఈ రెండు మ్యాచుల్లోనూ విజయం సాధించాలి. అప్పుడు భారత్ ఖాతాలోకి 4 పాయింట్లు వస్తాయి.అదే సమయంలో జింబాబ్వే, వెస్టిండీస్ ఖాతాల్లో 4 పాయింట్లు ఉండకూడదు. అలా అయితేనే భారత్ సెమీస్‌కు వెళ్తుంది. ఈ లెక్కన చూస్తే.. సౌతాఫ్రికా సెమీ ఫైనల్‌కు వెళ్లడం ఖాయం అనిపిస్తోంది.మిగిలిన రెండు మ్యాచుల్లో ఒకవేళ టీమిండియా.. ఒకదాంట్లోనే విజయం సాధిస్తేనే పరిస్థితి ఇంకా క్లిష్టంగా మారుతుంది. ఈ సందర్భంలో దక్షిణాఫ్రికా మిగిలిన తన రెండు మ్యాచుల్లో కచ్చితంగా విజయం సాధించాలి. వెస్టిండీస్-జింబాబ్వేకు మధ్య జరగనున్న మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టును భారత్ ఓడించాల్సి ఉంటుంది. అప్పుడు భారత్, జింబాబ్వే, వెస్టిండీస్ ఖాతాల్లో చెరో రెండు పాయింట్లు ఉంటాయి. నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉన్న జట్టు సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. కాబట్టి ప్రతి మ్యాచ్‌లో టీమిండియాకు నెట్ రన్‌రేట్ కీలకం కానుంది.





# ‘కిల్లర్’ సినిమా ఆకట్టుకుంటుంది



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా “కిల్లర్”. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. హైదరాబాద్ లో ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ ప్రొడ్యూసర్ సీతారామరావు మాట్లాడుతూ– “కిల్లర్” చిత్రం కోసం మేమంతా చాలా కష్టపడ్డాం. సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది. టీజర్ లాగే సినిమాకు కూడా మీ సపోర్ట్ అందిస్తారని కోరుకుంటున్నాం. అన్నారు. లైన్ ప్రొడ్యూసర్ దశరథ మాధవ్ మాట్లాడుతూ మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది. బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ తో ఆకట్టుకునేలా మూవీ ఉంటుంది. ఈ చిత్రంలో నేను బ్రదర్ రోల్ లో నటించాను. చిన్న సినిమా అయినా “కిల్లర్” పెద్ద విజయం సాధిస్తుంది. అన్నారు. యాక్టర్ మనీష్ గిలాడ మాట్లాడుతూ –ఈ చిత్రంలో నేను విలన్ క్యారెక్టర్ లో నటించాను. నన్ను ఒక పవర్ ఫుల్ విలన్ గా చూపించిన డైరెక్టర్ సుకు పూర్వాజ్ కి థ్యాంక్స్. ఈ సినిమాకు మేమంతా టీమ్ వర్క్ చేశాం. ఈ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద ఒక కొత్త హిస్టరీ క్రియేట్ చేయబోతున్నాం. అన్నారు.

యాక్టర్ గౌతమ్ చక్రధర్ మాట్లాడుతూ “కిల్లర్” సినిమాలో జ్యోతి పూర్వజ్ గారి యాక్షన్, ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. నేను కూడా కొన్ని యాక్షన్ సీక్వెన్సులు పర్ ఫార్మ్ చేశాను. ఈ సినిమా టెక్నికల్ గా మంచి క్వాలిటీతో మా డైరెక్టర్ రూపొందించారు. ఇది టీజర్ మాత్రమే సినిమాతో పెద్ద సక్సెస్ అందుకుంటామనే నమ్మకం ఉంది. అన్నారు. యాక్టర్ విశాల్ రాజ్ మాట్లాడుతూ మా సినిమా టీజర్ చూస్తేనే టెక్నికల్ గా మూవీ ఎంత క్వాలిటీగా ఉండబోతుందో మీ అందరికీ అర్థమై ఉంటుంది. జ్యోతి గారిని మనం సీరియల్స్ లో చూశాం. ఇప్పుడీ మూవీలో ఆమె పర్ ఫార్మ్ చేసిన విధానం సర్ ప్రైజ్ చేస్తోంది. డైరెక్టర్ పూర్వాజ్ నాకు మంచి ఫ్రెండ్. ఈ చిత్రంలో ఒక కీ రోల్ చేసే అవకాశం కల్పించారు. ఈ సినిమా మా టీమ్ అందరికీ మంచి గుర్తింపు తీసుకొస్తుందని ఆశిస్తున్నాం. అన్నారు. యాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జ్యోతి పూర్వజ్ గారిని కొత్తగా ఈ చిత్రంలో స్క్రీన్ మీద చూడబోతున్నాం. టెక్నికల్ వండర్ గా ఈ సినిమా ఉంటుంది. తెలుగు నుంచి వస్తున్న అరుదైన సినిమాల్లో ఒకటిగా కిల్లర్ పేరు తెచ్చుకుంటుంది. అన్నారు. యాక్టర్ చందు మాట్లాడుతూ కిల్లర్ మూవీలో నాకు ఒక మంచి క్యారెక్టర్ ఇచ్చి ఎంకరేజ్ చేస్తున్న సుకు గారికి థ్యాంక్స్. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఏంటనేది సస్పెన్స్. అందుకే టీజర్ లో కూడా రివీల్ చేయలేదు. కథలో ఆద్యంతం నా క్యారెక్టర్ ట్రావెల్ అవుతూనే ఉంటుంది.

# రిషబ్ శెట్టి-ప్రశాంత్ వర్మ కాంబోలో ‘జై హనుమాన్’ ప్రారంభం



‘హనుమాన్’ చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్‌లోని తదుపరి చిత్రం ‘జై హనుమాన్’ను అధికారికంగా ప్రారంభించారు. కర్ణాటకలోని హంపి సమీపంలో, ఆంజనేయుడి జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన అంజనాద్రి బెట్టపై పూజా కార్యక్రమాలతో ఈ సినిమా లాంఛనంగా మొదలైంది. ఈ చిత్రంలో హనుమంతుడి కీలక పాత్రను ‘కాంతార’ ఫేమ్, జాతీయ అవార్డు గ్రహీత రిషభ్ శెట్టి పోషిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రిషభ్ శెట్టి తన భార్య ప్రగతి శెట్టితో కలిసి హాజరయ్యారు. ‘హనుమాన్’ హీరో తేజా సజ్జా, దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాతలు పాల్గొన్నారు. ముహూర్తపు షాట్‌కు ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ క్లాప్ కొట్టగా, అనిల్ థడానీ కెమెరా స్విచాన్ చేశారు. స్క్రిప్ట్ అందుకున్న సమయంలో రిషభ్ శెట్టి భక్తిభావంతో కనిపించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పిస్తోంది. 2024 సంక్రాంతి బ్లాక్‌బస్టర్ ‘హనుమాన్’కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అత్యాధునిక సాంకేతికత, గ్రాఫిక్స్‌తో భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలిపారు.




# తన విలాసవంతమైన జీవితం వెనుక ఎంతో కష్టం ఉంది: హిమజ



బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, వెండితెరపై రాణిస్తున్న నటి, బిగ్‌బాస్ ఫేమ్ హిమజ రెడ్డి తాజాగా సోషల్ మీడియా వేదికగా విమర్శకులపై నిప్పులు చెరిగారు. కష్టపడి పైకొస్తున్న ఒక తెలుగమ్మాయి సక్సెస్‌ను చూసి ఓర్వలేక, క్యారెక్టర్ మీద పడి ఏడవడం ఏంటని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. గత కొంతకాలంగా తన లగ్జరీ లైఫ్, సంపాదనపై సోషల్ మీడియాలో వస్తున్న అసభ్యకరమైన కామెంట్లకు హిమజ తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. తను అనుభవిస్తున్న ఈ విలాసవంతమైన జీవితం వెనుక ఎంతో కష్టం ఉందని హిమజ స్పష్టం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సినిమాలు, సీరియల్స్‌లో శ్రమిస్తున్నానని, బిగ్‌బాస్ నుండి బయటకు వచ్చాక దాదాపు 12 షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నానని ఆమె గుర్తు చేశారు. ఒక్కో ఓపెనింగ్‌కు వచ్చే పారితోషికమే తను వాడుతున్న కారు కొనడానికి సరిపోతుందని ఘాటుగా సమాధానమిచ్చారు. కేవలం నటన మాత్రమే కాకుండా, హెర్బాలైఫ్ సూపర్‌వైజర్‌గా, స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్‌గా రాణిస్తూ, సొంతంగా ఒక కంపెనీని కూడా నడుపుతున్నట్లు ఆమె వెల్లడించారు. ముఖ్యంగా తన ఇంటి గురించి వస్తున్న ఆరోపణలపై హిమజ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇల్లు కొనడానికి తన తల్లిదండ్రులు కూడా ఆర్థికంగా ఎంతో సాయం చేశారని, అది తెలియకుండా ఎవరో గిఫ్ట్ ఇచ్చారని కామెంట్స్ చేయడం చూస్తే వారి మనసు ముక్కలవుతుందని అన్నారు. అవసరమైతే తన ఇంటి ఈఎంఐ పేపర్లు కూడా చూపిస్తానని సవాల్ విసిరారు. ఎదుటివారి ఎదుగుదలను చూసి అసూయ పడటం మానుకోవాలని, ఒక మహిళా నటి విజయం సాధిస్తే అభినందించడం నేర్చుకోవాలని హితవు పలికారు. హద్దు మీరి ప్రవర్తిస్తే ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని, చట్టపరమైన చర్యలకు కూడా వెనుకాడబోనని హిమజ హెచ్చరించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**